

## బాధ్యతలు చేపట్టిన హన్మంతరావు

తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ గా ఐఏఎస్ అధికారి ఎం.హన్మంతరావు బాధ్యతలు స్వీకరించారు.
పంచాయతిరాజ్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న హన్మంతరావును ఆదివారం ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన సోమవారం విధుల్లో చేరారు.

**- వరంగల్ వాయిస్, వరంగల్**


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 196 సోమవారం | 05 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




# పోరుగడ్డను మరిచారా..?




ఉద్యమ వీరుల చరిత్ర కలిగిన పరకాలను పర్యాటక కేంద్రంగా చేస్తామన్న గత పాలకుల మాటలు నీటిమూటలుగా మారాయి. సమైక్యపాలనలో నిర్లక్ష్యానికి గురైన దామెర చెరువుతోపాటు చుట్టు పక్కల ప్రాంతాలను రూ.7.15 కోట్లతో అభివృద్ధి చేస్తామన్న వారి హామీ కాగితాలకే పరిమితమైంది. మినీ ట్యాంక్ బండ్ ఊసే లేదు. చిల్డ్రన్స్ పార్క్, బోటింగ్, బతుకమ్మ ఘాట్, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు అటకెక్కింది. నిండుగా ఉన్న చెరువు, దాని చుట్టూ ఆహ్లాదాన్ని పంచుతున్న పచ్చని పంట పొలాలు, ఆ పక్కనే ఉన్న శ్రీ భవాని కుంకుమేశ్వర స్వామి ఆలయంతో పర్యాటకులను అమితంగా ఆకట్టుకోవాలన్న గత పాలకుల ఆలోచన కార్యరూపం దాల్చలేదు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టినట్టే పెట్టి కాలయాపన చేస్తున్నా పాలకులు, అధికారులు పెద్దగా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి. పనులు ఏళ్ల తరబడి సా.. గుతున్నా ప్రశ్నించేవారు కరువయ్యారు. దీంతో పోరుగడ్డ పరకాలలో పర్యాటకం అందని ద్రాక్షలా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. **- వరంగల్ వాయిస్, పరకాల**

- **కలగానే పరకాల పర్యాటక కేంద్రం హామీ**
- **ఊసే లేని మినీ ట్యాంక్ బండ్**
- **బోట్ తెచ్చారు.. బోటింగ్ మరిచారు**
- **అభివృద్ధికి నోచుకోని దామెర చెరువు**
- **గత పాలకుల నిర్లక్ష్యంపై జనం ఆగ్రహం**

# అండగా ఉండి.. ఆశీర్వదించండి

- ఓరుగల్లు ముఖచిత్రంపై చెదరని సంతకం ప్రణయన్నది
- మీ అందరి ఆశీస్సులతో త్వరలో నా నిర్ణయం వెల్లడిస్తా..
- ఆత్మీయ సమ్మేళనంలో దాస్యం అభినవ్ భాస్కర్




## గట్టమ్మను దర్శించుకున్న సీపీ



మేడారం సమ్మక్క -సారలమ్మ జాతరలో భాగంగా సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కుటుంబ సభ్యులతో కలిసి గట్టమ్మ దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ములుగు సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ రంజిత్ వరంగల్ పోలీస్ కమిషనర్ కు పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు.

**- వరంగల్ వాయిస్, ములుగు**




## 16నుంచి మేడారం ప్రత్యేక బస్సులు

- **జాతరకు వచ్చే మహిళలకు ఉచిత ప్రయాణమే..**
- **తరువాత కూడా రెగ్యులర్ బస్సులు**
- **మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క**



# పోరుగడ్డను మరిచారా..?

**కలగానే పరకాల పర్యాటక కేంద్రం హామీ**

**ఊసే లేని మినీ ట్యాంక్ బండ్ | బోట్ తెచ్చారు.. బోటింగ్ మరిచారు**

**అభివృద్ధికి నోచుకోని దామెర చెరువు**

**గత పాలకుల నిర్లక్ష్యంపై జనం ఆగ్రహం**

**వరంగల్ వాయిస్, పరకాల :** కాకతీయుల కాలంలో నిర్మించిన పరకాల పట్టణంలోని దామెర చెరువుకు నిర్లక్ష్యపు చీడ పట్టుకుంది. చెరువు కట్టపై మినీ ట్యాంక్ బండ్ తోపాటు చిల్డ్రన్స్ పార్క్, బోటింగ్, బతుకమ్మ ఘాట్, వాకింగ్ ట్రాక్ ల ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం రూ.7.15 కోట్లు కేటాయించినా అభివృద్ధి మాత్రం అందని ద్రాక్షలా మిగిలింది. పోరుగడ్డగా కీర్తి గడించిన పరకాలలో ఉద్యమ వీరుల చరిత్రకు కళ్లకు హత్తుకునేలా నిర్మించిన అమరదామంను చూసేందుకు పలు ప్రాంతాలనుంచి ఇప్పటికీ పర్యాటకులు వస్తుంటారు. వీరుల గాదలతోపాటు దామెర చెరువును అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందని అప్పటి ప్రభుత్వం భావించినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు, పాలకుల పట్టింపులేని తనంతో పరకాలలో పర్యాటకం పడకేసింది. పర్యాటక కేంద్రంగా మారితే పరకాల మరింత అభివృద్ధి చెందుతుందని భావించిన స్థానికుల కళలు కల్లలుగా మారాయి.

## సా..గుతున్న పనులు..

దామెర చెరువును అభివృద్ధి చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో మినీ ట్యాంక్ బండ్, చిల్డ్రన్స్ పార్క్, వాకింగ్ ట్రాక్ ల ఏర్పాటుకు గత ప్రభుత్వం నిధులను కేటాయించింది. ఈ మేరకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను అట్టహాసంగా ప్రారంభించారు. పనులు ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే కురిసిన వర్షానికి పోసిన మట్టి కొట్టుకుపోయింది. గుంతలమయంగా మారడం పరిపాటిగా మారింది. మళ్లీ సీను మొదటికొస్తుంది. దీంతో ఎస్టిమేషన్ నిధులు సరిపోవడం లేదన్న సాకుతో పనులనే పూర్తిగా నిలిపివేసినట్లు ప్రచారం సాగుతోంది.



## రూ.50లక్షలతో బోటు కొనుగోలు..

దామెర చెరువును అభివృద్ధి చేయాల్సి ఉన్నా అవేమీ పట్టించుకోకుండా రూ.50లక్షలతో బోటును కొనుగోలు చేశారు. దీనిని తీసుకొచ్చి దామెర చెరువులో ఏర్పాటు చేశారు. దీంతో పరకాల పట్టణ ప్రజలతోపాటు, పర్యాటకులకు బోటు షికారు అందుబాటులోకి వస్తుందని అందరూ భావించారు. బోటు తెచ్చి నెలలు గడుస్తున్నా దానిని తిప్పింది లేదు. దీంతో అది చెరువులో దిష్టి బొమ్మగా దర్శనమిస్తుంది. చాలా కాలంగా దానిని అలాగే ఉంచడంతో అది పనికిరాకుండా మారే ప్రమాదముందని పర్యాటకులు హెచ్చరిస్తున్నారు. బోటును ఏర్పాటు చేసిన ప్రాంతంలో పెద్ద ఎత్తున పొదలు పెరగడంతోపాటు అవి బోటును అల్లుకోవడంతో త్వరలో బోటు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.

## చర్యలేవి..

కేవలం పర్సంటేజీల కోసమే దామెర చెరువు మినీ ట్యాంక్ బండ్ ప్రతిపాదన తీసుకొచ్చినట్లు స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్లు వేయడం..వారికి రావాల్సిన కమీషన్లు తీసుకోవడానికే గత పాలకులు, అధికారులు పరిమితమయ్యారన్న ఆరోపణలున్నాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్ణీత కాలంలో పనులు పూర్తి చేయకపోతే నిబంధనల ప్రకారం ఆయనపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా స్పందించేవారే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ కు పనులు చేయడం సాధ్యం కాకపోతే ఆయనను తొలగించి మరో కాంట్రాక్టర్ కు పనులు అప్పగించే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడడంలేదు.

## పర్యాటక కేంద్రంగా చేయండి..

పోరాటాల పురిటి గడ్డగా పేరు గడించిన పరకాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సద్వినియోగం చేసుకొని వెంటనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని కోరుతున్నారు.

# 16నుంచి మేడారం ప్రత్యేక బస్సులు

**వరంగల్ వాయిస్, ములుగు :** భారతదేశంలోనే కుంభమేళా తర్వాత అతి పెద్ద జాతరైన మేడారంను ఈ సంవత్సరం ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ నున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి అమ్మవారి దేవాలయం వరకు ఆర్టీసి బస్సులోనే వారు అధికారులతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జాతరకు విచ్చేయు భక్తులకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విస్తృత ఏర్పాట్లు చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలు అయిన వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలతోపాటు హైదరాబాద్ మొదలగు 51 ప్రదేశాల నుంచి భక్తులను చేరవేయుటకు ప్రత్యేక జాతర క్యాంపులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర ప్రదేశ్, చత్తీస్ ఘడ్, ఒరిస్సా, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారి దీవెనలు పొందుతారన్నారు.. ఈ జాతర ఏర్పాట్లకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు రూ.2.25 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. మేడారం జాతరను జాతీయ ఉత్సవంగా జరుపుకుంటే దేశానికే గర్వకారణం అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు 14.50 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని గుర్తు చేశారు. జాతరకి వచ్చే మహిళలకు కూడా ఉచితంగా ప్రయాణం వర్తిస్తుందన్నారు. ఇప్పుడు కూడా ప్రతి రోజూ జాతరకి వచ్చే 1.20లక్షల మందిలో 70 వేల మంది ఆర్టీసీలో ప్రయాణం చేసిన వారే ఉన్నారన్నారు. ఎండి సజ్జనర్ ఆధ్వర్యంలో బస్ షెల్టర్లు, క్యు లైన్ లు, ఆర్టీసి క్యాంపులు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.



ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆర్టీసి విజయవంతంగా తమ విధులను నిర్వహిస్తే జాతర విజయవంతం అయినట్టే అన్నారు. మేడారం వచ్చే భక్తులకు సౌకర్యాలు అందించేందుకు మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. భక్తులకు ఇబ్బందులూ లేకుండానే వీఐపీలు చూసుకోవాలన్నారు. తాగు నీరు, ఆరోగ్యం తదితర అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉన్నామన్నారు. గతంలో రెండు వేల బస్సులు నడిపేది. .ఇప్పుడు 6 వేల బస్సులు నడుపుతున్నామన్నారు.



## పార్లమెంట్ బరిలో శంకర్ నాయక్ ..?

### కోరుకుంటున్న ప్రజలు, అభిమానులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నియోజక వర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమించిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, ప్రజాసేవకే నా జీవితం అంకితం అంటూ తన ఉద్యోగాన్ని పక్కన పెట్టి రాజకీయంలోకి ప్రవేశించి గెలుపోటములకు కృంగ కుండా మహబూబాబాద్ నియోజకవర్గం లో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మహబూబాబాద్ ప్రజల సేవ కోసం నిరంతరం పరితపించిన వ్యకి బానోత్ శంకర్ నాయక్. బీఆర్ఎస్ పాలనలో మహబూబాబాద్ ఎమ్మెల్యేగా కొనసాగిన సమయంలో సంక్షేమ పథకాలు అందించడం జరిగింది. అయితే దురదుష్టవశాత్తు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన నిత్యం జనం మధ్యలో శంకర్ నాయక్ ను ఎంపీ బరిలో ఉండాలని మహబూబాబాద్ జిల్లా ప్రజలు, శంకర్ నాయక్ అభిమానులు కోరుకుంటున్నారు. శంకర్ నాయక్ పోటీ చేస్తే భారీ మెజారిటీ తో గెలిపించుకుంటామని చెబుతున్నారు.

## కాపు శ్మశాన వాటికకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 58వ డివిజన్ వడ్డేపల్లి 100 ఫీట్ రోడ్డులో సోమవారం కోటి రూపాయల నిధులతో కాపు శ్మశాన వాటిక సీసీ రోడ్డుకు కోటి రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ 15సంవత్సరాల నుంచి ఎక్కడి సమస్యలు అక్కడే అన్న విధంగా వడ్డేపల్లి గ్రామం ఉందన్నారు. వడ్డేపల్లి వాసులకు జనరల్ శ్మశాన వాటిక లేక ప్రజలు పడుతున్న అవస్థలు చూసి వడ్డేపల్లి చెరువు మత్తడికి దగ్గరలోనే శ్మశాన వాటిక స్థల పరిశీలన చేయాలని అధికారులను కోరారు. నేడు ఆ శ్మశాన వాటికకు నిధులు కేటాయించి నిర్మాణ పనుల కోసం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఇటీ వల వర్షాలకు కొట్టుకు వచ్చిన దేక్కాకు వడ్డేపల్లి గోపాల్ పూర్ చెరువు, బంధం చెరువులో పాతుకు పోవడం వలన మత్స్య కారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారు ఎమ్మెల్యే నాయినికి వినతి పత్రం అందజేయగా ఆయన వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు ఇచ్చి వాటిని తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏ.నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్, 60వ డివిజన్ అధ్యక్షుడు అనుకోటి పున్నం, తాళ్లపల్లి రవీందర్, తాళ్లపల్లి మేరీ, మిట్టపల్లి శంకర్, రవీందర్, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లు, వడ్డేపల్లి గ్రామా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ ఇంచార్జి సింగపురం ఇందిర ఆదేశాల మేరకు రఘునాథపల్లి మండలంలోని అశ్వరావు పల్లి గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు తురుగొండ స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్సీ సెల్ నూతన గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. నూతన గ్రామ అధ్యక్షుడు పొన్నగంటి వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు తూర్గొండ అనిల్, ప్రధాన కార్యదర్శి కడారి రవీందర్, కోశాధికారి పొన్నగంటి రామచంద్రం, సలహా సంఘ సభ్యులు చాగంటి స్వామి, కొయ్యడ వెంకటయ్య, కడారి రాజశేఖర్ లుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ సెల్ మండల ఇంచార్జ్ జీడికంటి రాజ్ కుమార్, పీఎస్ఏ డైరెక్టర్ మేడిపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కర్నే అశోక్, గౌరవ అధ్యక్షుడు తూముకుంట్ల మల్లారెడ్డి, నిమ్మ పెద్ద కృష్ణారెడ్డి, జూలూరి వేణు, యూత్ అధ్యక్షుడు కుర్ర కుమారస్వామి, గద్దె రాజు, పొన్నగంటి రాజు, కొలిపాక ప్రభాకర్, స్వామి పాల్గొన్నారు.

# 16న కార్మిక సమ్మెను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆటో అండ్ ట్రాలీ వర్కర్స్ యూనియన్స్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ లో ఆటో డ్రైవర్లు ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మిక సమ్మెను గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఆటో అండ్ ట్రాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎండీ మహబూబ్ పాషా, కార్మికులు కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బీజేపీ ప్రజా కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి దేశవ్యాప్తంగా జరుగు సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ భారతీయ న్యాయ సంహిత 2023లో దారుణమైన సెక్షన్ 106(1)(2)లకు వ్యతిరేకంగా ఉద్యమించి రోడ్డు రవాణా రంగ కార్మికులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం కఠినమైన నిబంధనల గురించి మొదట యూనియన్లతో ప్రభుత్వం చర్చలు జరపాలని ఒత్తిడి చేయడం జరిగింది. ఇది రవాణా కార్మికులకు ఐక్య పోరాటానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఆటో, క్యాబ్, లారీ, డీసీఎం, స్కూల్ బస్సు, జీపు, అంబులెన్స్ ట్రాక్టర్స్ గూడ్స్, ట్రాన్స్ పోర్ట్ ఆయిల్ ట్యాంకర్స్, అయ్యర్ బస్సు ట్రాలీ, తదితర రవాణా రంగా కార్మికులందరూ 2024 పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో సవరణలు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో పాటు ఇన్సూరెన్స్ ప్రీమియం భారీ పెంపుదల, టోల్ టాక్సీ యంవీ యాక్ట్ సవరణతో పరిశ్రమతో పాటు కార్మికులను ఇప్పటికే నాశనం చేశారన్నారు. ప్రమాదాలను తగ్గించేందుకు మోటార్ వాహన చట్టాన్ని సవరణలు చేస్తున్నామని పేరుతో కేంద్ర ప్రభుత్వం యంవీ యాక్ట్ 2019ని తీసుకువచ్చింది. చిన్న చిన్న పొరపాట్లను కూడా వేలాది రూపాయలను జరిమానాలు వసూలు చేస్తూ డ్రైవర్లకు జైలు శిక్షలు కూడా అమలు చేసే విధంగా ప్రయత్నం చేస్తుందన్నారు. రవాణా రంగంలోని చిన్న యజమాలను ఓనర్ కమ్ డ్రైవర్లుగా ఉన్నవారు జీవించే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా కార్మిక గ్రామీణ బంద్ను విజయవంతం చేయడం కోసం ఆటో డ్రైవర్ల అందరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేణు, సతీష్, ఎండీ అమీర్, వి.సంపత్, ఎస్.నాగరాజు, బాబా రహమతుల్లా, ఎస్.కె అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల ఆత్మహత్యలకు కారకులను శిక్షించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో భీమారం దగ్గర నిరసన కార్యక్రమం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఆరేపల్లి సుజిత్ మాట్లాడుతూ భువనగిరి జిల్లా కేంద్రంలో ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి చదివే విద్యార్థులు భవ్య శ్రీ, వైష్ణవి ఆత్మహత్యకు పాల్పడడం విచారకరమన్నారు. ఈ ఆత్మహత్య కేవలం పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్ లా నిర్లక్ష్యం వల్లనే జరగిందని ఆరోపించారు. అదేవిధంగా అర్ధరాత్రి వేళ కొందరు ఆటో డ్రైవర్లు హాస్టల్ లోకి చొరబడి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించేవారని ఆరోపణలు ఉన్నాయని, కేవలం వాళ్ల తప్పును కప్పి ఉంచడం కోసం విద్యార్థుల ఆత్మహత్యకు మేం కారణం కాదంటూ మాట్లాడుతున్న వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాళ్లపల్లి అరుణ్, జోనల్ ఇంచార్జ్ శ్రవణ్ కుమార్, మనోజ్, సర్దార్, పవన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన సదస్సు




వరంగల్ వాయిస్, వరంగల్ : తూర్పు నియోజకవర్గం ఖిలావరంగల్ గ్రౌండ్ వద్ద ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆడెపు ఓవర్సీస్ కన్సల్టెన్సీ సీఈఓ ఆడేపు మధుసూదన్ అధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహణలో భాగంగా 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడెపు మధుసూదన్ మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే రోజూ ఆరోగ్యకరమైన ఆహారం తినడం అలవాటు చేసుకోవాలని, ప్రతి రోజూ ఒక అరగంట పాటు మెడిటేషన్, యోగా తప్పకుండా చేయడం అలవరుచుకోవాలన్నారు. ప్రతి రోజూ శుచి, శుభ్రతతో కూడిన ఆహారం తినాలని సూచించారు. అనంతరం 2కె రన్ లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

# అక్కడ చెల్లని పైసా ఇక్కడ అవసరం లేదు

### తాటికొండను కాంగ్రెస్‌లోకి తీసుకోవద్దు
### పార్టీ అధిష్టానానికి పార్టీ నాయకుల వినతి



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్‌పూర్ :** మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నాయకులు మేకల నరేందర్ మాట్లాడుతూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో గతంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జనగామ నియోజకవర్గంలో ఉన్నటువంటి రఘునాథపల్లి, లింగాలఘనపూర్ మండలాలు బలంగా ఉన్నకాంగ్రెస్ పార్టీలో గెలిచిన తాటికొండ రాజయ్య గతంలో కేసీఆర్ దళిత ముఖ్యమంత్రి అనగానే రాజీనామా చేయడంతో పాటు పార్టీని విచ్చిన్నం చేశారని ఆరోపించారు. ఆ తర్వాత గెలిచిన మీకు మంత్రి పదవి కట్టబెడితే ఎందుకు తొలగించారో ? ఇప్పటికీ ఇక్కడ ప్రజలకు తెలియదన్నారు. అప్పుడు ఎక్కడ పోయింది మీ ఆత్మగౌరవం అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ఎన్నికల ముందు మీకు టికెట్ రాకుండా వేరొకరికి ఇచ్చినప్పుడు లేని ఆత్మగౌరవం ఇప్పుడు ఎక్కడి నుంచి వచ్చిందన్నారు. గతంలో తాటికొండ మీద వచ్చినటువంటి దళిత బంధు ఆరోపణలు, ప్రజాప్రతినిధులకు టికెట్లు అమ్ముకోవడం, పార్టీలో కష్టపడ్డ నాయకులకు, కార్యకర్తలకు కూడా పదవులు అమ్ముకోవడం, ఇది నిజం కాదా అని నిలదీశారు. అందుకోసం నిన్ను పక్కన పెడితే గతంలో మండలంలో ఉన్న పలు గ్రామాలను దత్తత తీసుకున్న మీరు వాటిని ఎలాంటి అభివృద్ధి చేయకపోగా ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని చేసిన రాజకీయాలు ఇక చాలని ప్రజలు నిన్ను చీత్కరించడం నిజం కాదా అన్నారు. కాబట్టి ప్రజల కోరిక మేరకు ఇక రాజకీయాలకు స్వస్తి పలికి శేష జీవితాన్ని ప్రజలకు ఉచిత వైద్యం అందించాలని కోరుకుంటున్నామని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తోటకూరి రమేష్, గుగులోతు కొమురెల్లి, ప్రధాన కార్యదర్శి కవాటి భాస్కర్, ఎంపీటీసీ భిక్షపతి నాయక్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లూరి పృథ్వీరాజ్, మండల నాయకులు కొల్లిపాక మల్లేష్, మాజీ సర్పంచ్ లోనే రవి చంద్రారెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

# దేశ సేవ చేయాలనే యువతకు అగ్నిపథ్ ఆయుధం

## ఆర్మీ సీనియర్ నాన్ కమిషన్ ఆఫీసర్ రాజేష్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆర్మీలో చేరి కొద్దిరోజులైనా సేవలు అందించాలని కలలు కనే యువతకు అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ చాలా ఉపయోగకరమని ఎయిర్ ఫోర్స్ సీనియర్ నాన్ కమిషన్ ఆఫీసర్ రాజేష్ అన్నారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్(కో–ఎడ్యుకేషన్) కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ ధర్మేంద్ర అధ్యక్షతన విద్యార్థులకు అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ స్కీమ్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఏ గోపాల్, కేడీసీఎన్ సీసీ ఆఫీసర్ డాక్టర్ కే ఓంకార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రివిధ దళాల్లో మమేకమై దేశానికి సేవచేయాలని భావిస్తున్న యువతకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో త్రివిధ దళాల్లో రిక్రూట్‌మెంట్ కోసం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ సరికొత్త విధానాన్ని ప్రకటించారన్నారు. ఇండియన్ ఆర్మీలో చేరి కొద్దిరోజులైనా సేవలు అందించాలని కలలు కనే యువతకు ఇది నిజంగా మంచి అవకాశమని తెలిపారు. అలాంటి వారి కోసమే ఈ అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ స్కీమ్‌ను ప్రకటించారన్నారు. అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభం అయిందని, ఎంపికైనవారిని అగ్నివీర్‌గా పిలుస్తారన్నారు. ఎంపిక ప్రక్రియ ఆన్‌లైన్ సెంట్రలైజ్డ్ సిస్టమ్ ద్వారా జరుగుతుందని, సాయుధ బలగాల్లో రెగ్యులర్‌గా జరిగే నియామకాలకు ఎలాంటి విద్యార్హతలు ఉంటాయో అగ్నివీర్ పోస్టులకు కూడా అవే అర్హతలు ఉంటాయన్నారు. ఈ స్కీమ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం మొదట 45,000 మంది అగ్నివీర్‌లను నియమించుకోనుందని, 17.5 ఏళ్ల నుంచి 21 ఏళ్ల లోపున్న అభ్యర్థులు ఈ స్కీం కింద దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని అన్నారు. ఈ స్కీం కింద ఎంపికైన వారికి కఠిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఎలాంటి భౌగోళిక వాతావరణంలోనైనా ఎడారులు, కొండలు, సముద్రంతో పాటు ఆకాశంలో విధులు నిర్వర్తించడానికి ఎంచుకోవచ్చన్నారు. మహిళలకు ఇప్పుడే అవకాశం లేదని, త్వరలోనే వారు కూడా ఈ స్కీం కింద దరఖాస్తు చేసుకోవడానికి అవకాశాలు కల్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులకు పరిష్కారం చూపాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రజావాణిలో ప్రజలు అందించిన దరఖాస్తులలోని సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సవ్ టొప్పో తో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా తుర్కూరు మండలానికి చెందిన ఎండీ చాందిని సుల్తానా ఆన్ లైన్ గేముల ద్వారా తన బ్యాంకు ఖాతాలోని డబ్బులు పోయాయని, న్యాయం చేసి తిరిగి తనకు డబ్బులను ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. మహబూబాబాద్ పట్టణం నందినగర్ కాలనీవాసులు తమ కాలనీలో కొన్ని సంస్థల వారు సెల్ టవర్ నిర్మించేందుకు తలెపెట్టారని, తమ పిల్లల ఆరోగ్యాలను పరిగణలోకి తీసుకుని ఎటువంటి సెల్ టవర్ నిర్మాణాలకు పర్మిషన్ ఇవ్వొద్దని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో (135)దరఖాస్తులను వివిధ శాఖల అధికారులకు పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణిలో జడ్పీ సీఈఓ రమాదేవి, సీపీఓ సుబ్బారావు, జిల్లా అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్‌నెస్ న్యూట్రిషన్ సెంటర్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని బస్టాండ్ సమీపంలో అమ్మ వెల్ నెస్ న్యూట్రిషన్ సెంటర్ ను సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సెంటర్ ద్వారా చాలామందికి న్యూట్రిషన్ చిట్కాలు అందరికీ ఉపయోగ పడుతాయని తెలిపారు. ఈ సెంటర్ సేవలు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బత్తుల కుమార్‌కు ఎంపీ సీటు ఇవ్వండి

### మాజీ ఎమ్మెల్యే నరేందర్‌కు వినతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 32వ డివిజన్‌లోని ఉద్యమ కారుడు, బడుగు బలహీన వర్గాల దళిత నాయకుడు బత్తుల కుమార్ ను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని 32వ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అందరూ ఏకతాటిగా తూర్పు మాజీ శాసనసభ్యుడు నరేందర్ కు వినతి పత్రం అందజేశారు. 2001 నుంచి ఉద్యమంలో ఉంటూ రాష్ట్ర సాధనకు తనవంతుగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తూ పలు కేసులలో జైలుకు సైతం వెళ్లి మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుతో కూడా ఉద్యమ సమయంలో జైలులో ఒకే బ్యారేజ్ లో ఉన్న ఉద్యమకారుడు బత్తుల కుమార్ ను ఎంపీ అభ్యర్థిగా గుర్తించి సీటు ఇవ్వాలన్నారు. ఈ విషయంలో మాజీ ఎమ్మెల్యే నరేందర్ బీఆర్ఎస్ అధిష్టానానికి తెలపాలని 32వ డివిజన్ కార్యకర్తలు, ముఖ్య నాయకులు, మహిళ నాయకులు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మా రవి, డివిజన్ అధ్యక్షుడు పొగాకు సందీప్, మాజీ కుడా డైరెక్టర్ మోడం ప్రవీణ్, మండా శ్యామ్, శివ మూర్తి, ఉద్యమకారుడు పరదేశి రాజేష్, కొండ రాజు, ఆడెపు భిక్షపతి, జగన్, మహిళా అధ్యక్షుడు కేదారి పద్మ, పర్సనల్ సువర్ణ, కళావతి, నాగమణి, రాకన్ కవిత, డివిజన్ ఉపాధ్యక్షుడు శోభన్ బాబు, బత్తిని సతీష్, మండ సాగర్, కొండ సూరి, ఎండీ దస్తగిరి, మాటేటి శ్యామ్, చిరంజీవి, రాయుడు, నీలం శివ, మహేష్, రేవంత్, నూక రమేష్, నరసింహా, తాళ్లపల్లి శివ, రవీందర్, మెంతుల రేణుక, భారత్, సమీర్ అక్రమ్, చింత వేణు, ప్రభు సాగర్ పాల్గొన్నారు

## ప్రభుత్వ వైద్య కళాశాల ఎదుట ధర్నా



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదుట పీడీఎస్ యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన ఉద్దేశించి పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోనగిరి మధు మాట్లాడుతూ వైద్య కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టాలన్నారు. అవినీతికి పాల్పడిన అధికారుల పై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోనగిరి మధు, జిల్లా కోశాధికారి మునగాల మహేష్, జిల్లా నాయకులు గుగులోతు విజయ్, టౌన్ నాయకులు వినయ్, దిలీప్, వేణు, సంజయ్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ మొక్కులు చెల్లించిన కొలిపాక సతీష్



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్ పూర్ :** మండల కేంద్రంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి కొలిపాక సతీష్ మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతలకు ఎత్తు బంగారం చెల్లించడానికి సోమవారం బంగారం తులాభారం చేయడం జరిగింది. 19ఫిబ్రవరి 2022 సంవత్సరంలో టీపీసీసీ అధ్యక్షుడు, నేటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మేడారం వెళ్లినప్పుడు 2024లో జరిగే మేడారం జాతరలోపు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకోవడం జరిగింది. అలాగే అదే రోజు రేవంత్ రెడ్డి హైదరాబాద్ వెళ్లేటప్పుడు ఘనపూర్ లో కొలిపాక సతీష్ అపి మాట్లాడినప్పుడు రేవంత్ రెడ్డితో 2024 మేడారం సమ్మక్క సారలమ్మ జాతర లోపు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మీరు సీఎంగా పదవీ బాధ్యతలు చేపడితే నా ఎత్తు 84కేజీల 340 గ్రాముల బంగారం ఇస్తానని చెప్పడం జరిగిందని తెలిపారు. అన్నట్లుగానే సోమవారం ఎత్తు బంగారం సమ్మక–సారలమ్మలకు తులాభారం వేసి కొలిపాక సతీష్ మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా కార్యదర్శి మేకల మల్లేశం, కుంభం ఉపేందర్, జంపాల శ్రీనివాస్, ఈశ్వర్ ప్రసాద్, మామిండ్ల శ్రీనివాస్, శ్రీకాంత్, కొలిపాక క్రాంతి, నీలా రాజు, తదితరులు పాల్గొన్నారు.

## వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక 32, 33వ డివిజన్ లోని శిరంగి రాజారాం తోట(ఎస్ఆర్ఆర్ తోట)లో నూతన బొడ్రాయి స్థాపన కోసం అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. బొడ్రాయి స్థాపన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కుల గణనకు మంత్రి మండలి ఆమోదం హర్షణీయం

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ రాసిన"జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం"ను రాష్ట్రఅధికార గీతంగా మంత్రిమండలి ఆమోదించడం హర్షణీయమని తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో అందెశ్రీ రాసిన ఈ పాట జనం నోట మారు మోగిందని, ప్రజలను జాగృత పరచిందన్నారు. అనేక త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రంలో ఈ గీతం రాష్ట్ర అధికార గీతంగా ఉంటుందని ఆశిస్తే నిరాశే మిగిలిందన్నారు. 10సంవత్సరాల తర్వాత కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఈ గీతాన్ని రాష్ట్ర అధికార గీతంగా నిర్ణయించడం స్వాగతిస్తున్నామన్నారు. వరంగల్ జిల్లా జనగామ దగ్గర గల రేబర్తి గ్రామం మద్దూరు మండలం (ప్రస్తుతం సిద్ధిపేట జిల్లా)లో నిరుపేద కుటుంబంలో జన్మించిన చదువుకోవడానికి కూడా అవకాశం లేక పశువులకాపరిగా పనిచేసిన అందెఎల్లయ్య(అందెశ్రీ )ఇంత గొప్ప గేయ రచయితగా ప్రముఖ కవిగా ఎదగడం మనందరికీ గర్వకారణమన్నారు. అందెశ్రీ కి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో బీసీ కుల గణన చేయడానికి మంత్రి మండలి నిర్ణయించినందున శాసనసభ సమావేశాలలో బిల్లు పెట్ టిఆమోదించి తక్షణమే ప్రక్రియ ప్రారంభించాలన్నారు. సినీ ప్రముఖులకు కవులు, కళాకారులకు ప్రభుత్వం అందజేసే నంది అవార్డులను ప్రముఖ కవి, ప్రజా గాయకుడు గద్దర్ అవార్డులుగా అందజేస్తామని ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించడం స్వాగతిస్తున్నామన్నారు. ఎన్నికల వాగ్దానాలను ప్రాధాన్యత క్రమంలో అమలుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, ఫిబ్రవరి 7 నుంచి 15 వరకు గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని, రాబోయే వేసవికాలంలో గ్రామాలలో త్రాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో గ్రామాల ప్రత్యేక అధికారులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో సర్పంచ్ ల పదవీకాలం ముగిసినందున తిరిగి ఎన్నికలు నిర్వహించే వరకు గ్రామాలలో ప్రత్యేక అధికారులతో పాలన కొనసాగుతుందని తెలిపారు. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల విధి నిర్వహణ బాధ్యతలు అభినందనీయమని, నూతనంగా వచ్చిన ప్రత్యేక అధికారులకు సహకరిస్తూ గ్రామీణ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో నియామకమైన ప్రత్యేక అధికారులు అందుబాటులో ఉండాలని, నూతన చట్టంపై అందరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ పి.శ్రీజ, ప్రత్యేక అధికారులు జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, డీఎంహెచ్ఓ అప్పయ్య, జడ్పీ సీఈవో ప్రసూన రాణి, ఎస్సీ డెవలప్ మెంట్ ఈడీ తుల రవి, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా కరెంటు స్తంభం

## షాపుల ముందు వేలాడుతున్న విద్యుత్ తీగలు
## పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** వేలాడుతున్న విద్యుత్ తీగలు, స్తంభానికి ఉన్న కనెక్షన్ వైర్లు, డిష్ వైర్ల తో మోయలేక వంగి ఇరుగుటకు సిద్ధంగా ఉన్న కరెంటు స్తంభంతో ఏ క్షణాన ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇది హసన్ పర్తి గ్రామానికి మెయిన్ రోడ్డు గాంధీ విగ్రహం నుంచి రెండవ స్తంభం వద్ద వేలాడే కరెంటు వైర్లను చూసి ప్రజలు నడవాలంటే భయభ్రాంతులు గురవుతున్నారు. తీగలు ఒకదానికి ఒకటి తాకి మంటలు వస్తున్నాయని, వేలాడే కరెంటు తీగలతో కోతులు ఉయ్యాల వాలే ఊగడంవల్ల తీగలు వేలాడి రహదారి నుంచి పోయే వాహనాలకు ఇబ్బంది కలుగుతోంది. అప్పుడప్పుడు వాహనాలు తాకి వైర్లు తెగి ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రాణం నష్టం జరిగే వరకు అధికారులు స్పందించారా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



# క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగర పాలక సంస్థ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ బహుజన మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం 2024 క్యాలెండర్ ను మున్సిపల్ కమిషనర్ ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సీఎంహెచ్ఓ యూనియన్ ముఖ్య సలహదారుడు వక్కల వెంకన్న, అధ్యక్షులు వక్కల రాణాసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుద్దాల కుమార్, ప్రధాన కార్యదర్శి ఎర్ర అరుణ్, కోశాధికారి యూజీన్, ఉపాధ్యక్షులు లింగాల ప్రియాంక, కార్యదర్శి కుమ్మరి అశోక్, చిరంజీవి, పవన్, కొంగర రమేష్, ప్రదీప్, శివరామకృష్ణ, అనిల్, కొర్నెల్, కలిల్, రాజేష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# విద్య బలోపేతానికి ప్రభుత్వం కృషి

## విప్ జాటోతు రామచంద్రనాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యం అయిన విద్యను బలోపితం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ, విప్ డాక్టర్ జాటోతు రామచంద్రనాయక్ అన్నారు. మండలంలోని వీరారం ఉన్నత పాఠశాలలో మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ తో కలిసి రూ.13.50 లక్షలతో నిర్మాణం చేపట్టే సైన్స్ ల్యాబ్ ను ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. ముందుగా మొదటిసారిగా గ్రామానికి వస్తున్న ఎమ్మెల్యేను విద్యార్థులు పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం హై స్కూల్ హెచ్ఎం లక్ష్మి నిర్మల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చదువుతోనే పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, చిన్నప్పటినుంచి కష్టపడి చదువుతేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు అన్నారు. ప్రభుత్వ స్కూల్లో అన్ని సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని, అందుకు ఉపాధ్యాయులు కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. హైస్కూల్ కు విలువైన రెండు ఎకరాల స్థలాన్ని అందించిన దాత డాక్టర్ కట్కూరి నరేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్య, వైద్యం బలోపేతం చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం వేసవి ప్రారంభం అవుతున్నందున సాగునీరు, తాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గంలోని కురవి మండలంలో ఏకలవ్య స్కూల్ ఏర్పాటు తన హయాంలో జరిగిందన్నారు. త్వరలో ఉపాధ్యాయుల నియామకం ఉంటుందన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ తానే పోటీ చేస్తున్నట్లు ఆదరించాలని కోరారు. అనంతరం గ్రామంలో నిర్మించిన పార్టీ గద్దెపై ఎమ్మెల్యే కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ జెండాలు ఆవిష్కరించారు. అదేవిధంగా గ్రామంలోని ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి, దాత కట్కూరి నరేందర్ రెడ్డి, మండల నాయకులు తాజుద్దీన్, గుగులోతు రవి, గ్రామ నాయకులు బుర్ర యాదగిరి, జెట్టి రాములు, బొల్లం కొమరయ్య, భయ్య మల్సూర్, బుర్ర వెంకన్న, అజ్మీర సూర్య, దాసరి మునేష్, విజయ్, ఏర్పుల లింగయ్య, దుస్సలింగమల్లు, చింతల యాకన్న, కేలోత్ వెంకన్న, గుగుల్ సైదులు, బానోత్ హరిసింగ్, బానోత్ రామచంద్రు, అజ్మీర రమేష్, భూక్య మంగీలాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యాయవాదులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

## బీఆర్ఎస్ నేత కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదులను ప్రత్యేకంగా కలిసి ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్ ఓటర్స్ నమోదు చేసుకోవాలని కోరుతూ హనుమకొండ జిల్లా, వరంగల్ జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ నాయకులతో పాటు బారి అసోసియేషన్ హల్ లో ఉన్న ప్రతి న్యాయవాది దగ్గరికి తిరుగుతూ బీఆర్ఎస్ నేత కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని సమున్నతంగా నిర్మించేది ఉన్నంత విద్యావంతులేనని, ఓటు హక్కు అనేది మన ఆయుధమని, మన తలరాతలు మనమే మార్చుకోగల చైతన్యవంతులమని త్వరలో నిర్వహించబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటు హక్కు కోసం ఈ నెల ఫిబ్రవరి 6లోపు నమోదు చేసుకోవాలని కోరారు. ఒకరోజు మాత్రమే సమయం ఉందని అందరు దాన్ని సద్వినియోగం చేసుకొని ఆఫ్ లైన్ కోసం ఫామ్ 18ని పూర్తి చేసి తహసీల్దార్ కు ఇవ్వాలని, ఆన్ లైన్ అయితే సర్టిఫికెట్స్ అప్ లోడ్ చేస్తే సరిపోతుందన్నారు. అయితే గతంలో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్నవారు కూడా మళ్లీ ఓటర్ గా నమోదు చేసుకోవాలని, కొత్త వారైతే 2020నవంబర్ లోపు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు అని అన్నారు. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ తో పాటు నల్గొండ, ఖమ్మం లో విస్తృతంగా తిరిగి గ్రాడ్యుయేట్స్ ను కలుస్తు ఓటరుగా నమోదు చేయిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అవకాశం ఇస్తే పోటీకి సిద్ధంగా ఉన్నానని ఒక సందర్భంలో చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ నుండి శ్రీధర్, న్యాయవాదులు శ్రీనివాస్, ముకేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జోరిక రమేష్, బి.వీరేందర్, బి,ప్రశాంత్, డా.కృష్ణ, పరుశురాం,రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా ఎల్తూరి శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా పరకాల పట్టణానికి చెందిన ఎల్తూరి శ్రీనివాస్ ను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిన్న జరిగిన తెలంగాణ రాష్ట్ర ఈసీ సమావేశంలో ఎన్నుకున్నారు. సోమవారం బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పలువురికి పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దానిలో భాగంగా హనుమకొండ జిల్లా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడిగా పరకాల పట్టణానికి చెందిన ఎల్తూరి శ్రీనివాస్ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఎల్తూరి శ్రీనివాస్‌ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీఎస్పీ పరకాల అసెంబ్లీ ఉపాధ్యక్షుడు ఎండి అంజాద్ పాషా, పరకాల మండల అధ్యక్షుడు పెండెల మహేందర్, నడికొండ మండల అధ్యక్షుడు శనిగరపు వెంకటేష్, దామెర మండల అధ్యక్షుడు ముత్యాల నరేందర్, ఆత్మకూరు మండలం కన్వీనర్ ఆర్షం మధుసూదన్, సంగెం మండల నాయకులు పరకాల శ్రీకాంత్, గుండేటి మధు, దామెర రాజేందర్, గీసుకొండ మండల నాయకులు టి.శివశంకర్, తదితరుల హర్షం వ్యక్తం చేశారు. బహుజన సమాజ్ పార్టీ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తామని నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి శ్రీనివాస్ తెలియజేశారు.

# టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయండి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పదవ తరగతి విద్యార్థుల భయందోళనలు పోగొట్టడానికి, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీయడానికే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీలలో నిర్వహించే 10వ తరగతి టాలెంట్ టెస్ట్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తొర్రూరు మండలంలోని గుర్తూరు మోడల్ స్కూల్, అమ్మాపురం, తొర్రూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టాలెంట్ టెస్ట్ పదో తరగతి వారికి ఉపయోగంగా ఉంటుందన్నారు. కశ్చన్ పేపర్ ను మేధావుల చేత తయారు చేయబడుతుందని తెలిపారు. ఇందులో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ అంటే పోరాటాలే కాదు, ఇలాంటి అభినందనీయ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ కనబరిచిన గవర్నమెంట్ విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9948154021 సంప్రదించగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అమీర్, నాయకులు వినయ్, మహేష్, ప్రవీణ్, ప్రణీత్ పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఈవీఎంల మొదటి దశ తనిఖీ

## కలెక్టర్ సిక్తా పట్నాయక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల మొదటి దశ తనిఖీ (ఫస్ట్ లెవెల్ చెకింగ్) నిర్వహణను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎంల గోదాముల వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో జరుగుతున్న ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈనెల 5నుంచి 12వరకు ఈవీఎంల మొదటి దశ తనిఖీ నిర్వహణను ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందం సమక్షంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మొదటి దశ తనిఖీ నిర్వహణ ప్రక్రియను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి దశ తనిఖీ ప్రక్రియలో ఈవీఎంలకు సంబంధించిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ యంత్రాల పనితీరును పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈవీయంల మొదటి దశ తనిఖీ నిర్వహణ ప్రక్రియను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ముగిసిన తర్వాత మాక్ పోలింగ్ నిర్వహిస్తామని, అప్పుడు కంట్రోల్ యూనిట్ లో వచ్చిన ఓటు వివరాలు వీవీ పాట్ స్లిప్పుల వివరాలను చెక్ చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఎఫ్ ఎల్ సీలో పాల్గొంటున్న అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్ జి, హనుమకొండ ఆర్డీవో రమేష్, తహశీల్దార్లు నాగరాజు, బావ్ సింగ్, జ్యోతి వరలక్ష్మి దేవి, జగన్మోహన్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాదరావు, నాయబ్ తహసిల్దార్లు సంతోష్, వితలేశ్వర్, శ్యామ్, వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్ రావు, కుసుమ శ్యామ్, రజనీకాంత్, సయ్యద్ ఫైజుల్లా, మణి తదితరులతో పాటు ఈసీఐఎల్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# తాటికొండ రాజయ్యను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు

## ధర్మసాగర్ కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను కాంగ్రెస్ లోకి చేర్చుకోవద్దు అంటూ ధర్మసాగర్ మండల అధ్యక్షుడు గుర్రపు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలోని డాక్టర్ రాజయ్య నాలుగు సార్లు అధికారంలో ఉండి మాదిగ బిడ్డలకు అన్యాయం జరిగిందని ఇప్పుడు అంటున్నారని మండిపడ్డారు. కానీ అధికారంలో ఉన్నప్పుడు మాదిగలకు ఏ న్యాయం చేసిందని ఇప్పుడు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. దళిత బంద్ లో కమీషన్లు తీసుకొని దళితులను మోసం చేసిన రాజయ్యను దళితులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో పది సంవత్సరాల నుంచి సింగపురం ఇందిర కాంగ్రెస్ కార్యకర్తలను కాపాడుతూ నియోజకవర్గం కార్యకర్తలను ఒక తాటిపై తీసుకువచ్చి 2023 ఎలక్షన్ల లో కొద్ది తేడాతో ఓటమి పాలయ్యారని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నా లేకున్నా కార్యకర్తలకు అభయమిస్తూ కార్యకర్తలను రక్షిస్తున్నారు. రాజయ్య మళ్లీ పార్టీలో చేరితే కాంగ్రెస్ లో గ్రూపు రాజకీయాలు నడుస్తాయన్నారు. రాజయ్య తన సొంత ఆస్తులను కాపాడుకోవడానికి లేదా తన స్వలాభాల కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరుతారని వారు విమర్శించారు.

# వ్యర్థ పదార్థాలను స్వచ్ఛ ఆటోకు అందజేయాలి

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ లోని కొన్ని ప్రాంతాలలో ప్రజలు ఇండ్లలో ఉండే వ్యర్థ పదార్థాలను మురికి కాలువలలో వేయడం వలన మురుగు కాలువలు నిండి మురుగు నీరు బయటకు పోకుంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. డివిజన్ లోని ప్రజలందరూ తమ తమ ఇండ్లలోని అక్కరకు రాని వస్తువులు, వ్యర్థ పదార్థాలను మహానగరపాలక సంస్థ స్వచ్ఛ ఆటోకు అందజేయాలని ప్రజలకు కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. తోట రామచంద్రం రైస్ మిల్ గల్లీ, కరీమాబాద్ రజక వాడ, కటిక వాడలలో కార్పొరేటర్ మరుపల్ల రవి పర్యటించి శానిటేషన్ సిబ్బందితో కాలువలను శుభ్రం చేయించారు.

# ప్రత్యేక అధికారులు పారదర్శకంగా పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు జవాబుదారీతనంతో పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. సోమవారం జిల్లా జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులకు పంచాయతీ పాలనపై జరిగిన శిక్షణా కార్యక్రమనికి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడేతో కలసి హాజరై సమర్థవంతంగా విధుల నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ప్రత్యేక అధికారికి మూడు గ్రామపంచాయతీలు పరిశీలించే బాధ్యత ఉందని, ప్రతిరోజు ఒక గ్రామ పంచాయతీ పరిశీలన చేస్తూ రోజూ చేయవలసిన కార్యక్రమాలపై ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులను సిబ్బందితో సమన్వయం చేసుకొని పనిచేయాలని తెలిపారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా 'మిషన్ భగీరథ'తో తాగునీటి సరఫరా చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు, పారిశుధ్యం, నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ, డంపింగ్ యార్డు నిర్వహణ, వైకుంఠ ధామాల అభివృద్ధిపై సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. రాబోవు వేసవిని దృష్టిలో పెట్టుకుని నర్సరీలలో మొక్కలకు నీటి సౌకర్యం, పంచాయతీ ట్రాక్టర్స్ వాటర్ ట్యాంకర్ లని చేసేలా చూడాలన్నారు. 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశు ధ్య కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం సర్కులర్ రిలీజ్ చేసిందని ప్రతిరోజు చేపట్టిపోయే కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులకు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయడం జరిగిందని ప్రతిరోజు చేసే కార్యక్రమాలను గ్రూప్‌లో పోస్ట్ చేయాలన్నారు. ప్రత్యేక అధికారుల పాలన సమర్థవంతంగా నిర్వహించి ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అన్నారు. జిల్లా పంచాయతీ అధికారి కల్పన, డీఆర్డీఏ పీడీ సంపత్ రావు, మిషన్ భగీరథ ఎస్ఈ రాములు, సంబంధిత ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి

## బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజావాణి (గ్రీవెన్స్)లో స్వీకరించిన దరఖాస్తు దారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలు గ్రీవెన్స్ వినతుల పరిష్కారంపై నిర్వహించిన రివ్యూ సమావేశంలో కమిషనర్ పాల్గొని తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి పట్టణ ప్రణాళిక విభాగ సంబంధ సమస్యలపై అత్యధికంగా ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని, ఆ సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి వహించాలని, క్షేత్ర స్థాయిలో సమస్య తీరుని పరిశీలించి వాస్తవ పరిస్థితుల ఆధారంగా నిర్ణయాలు తీసుకొని పరిష్కరించాలని, నీటి సరఫరా తీరుకు సంబంధించిన ఫిర్యాదులు కూడా వస్తున్నాయని, నిర్లక్ష్య ధోరణి వీడి నీటి విడుదల క్రమంలో ఏఈలు ప్రతి రోజు క్షేత్రస్థాయిలో నీటి సరఫరా తీరును పరిశీలించి లీకేజీలను గుర్తించి అరికట్టేలాగా చర్యలు తీసుకోవాలని, టేయిలెండ్ పాయింట్ వరకు నీరు అందేలా చూడాలని, అందుతుందో లేదో అనే పరిశీలించాలని కమిషనర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్లు అనిసుర్ రషీద్, రవీందర్ యాదవ్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ డా.రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న, సెక్రెటరీ విజయ లక్ష్మి, బయాలజిస్ట్ మాధవ రెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, హెచ్ఓ రమేష్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రేపు కుక్కల దాడుల చర్యలపై అవగాహన..

రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో కుక్కల దాడులు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి మంగళవారం ఉదయం 11గంటలకు స్థానిక వెంకటేశ్వర గార్డెన్ లో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేససినట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్, కమిషనర్, పశుసంవర్ధక శాఖ అధికారులు, నిపుణులు పాల్గొని కుక్కల దాడి బారి నుంచి ముందస్తు జాగ్రత్తగా తీసుకోవలసిన చర్యలపై వివరిస్తారని, కాబట్టి కార్పొరేటర్లు, మెప్మా సిబ్బంది, ఎన్జీఓలు, శానిటేషన్ సిబ్బంది, కుక్కల బ్రీడర్లతో పాటు ఆసక్తి గల నగరవాసులు పాల్గొనాలని సీఎంహెచ్ఓ కోరారు.

# బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ వరంగల్ అర్బన్ ప్రధాన కార్యదర్శిగా అడెపు రాజేంద్రప్రసాద్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ వరంగల్ కు చెందిన సంఘం సేవకుడు ప్రజా వైద్యులు డా.అడేపు రాజేంద్రప్రసాద్ ను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ వరంగల్ అర్బన్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ నియామకాన్ని బీసీ సంక్షేమ సంఘం అర్బన్ వరంగల్ అధ్యక్షుడు అప్పరాజు రాజు నేడు ఉత్తర్వులు జారీ చేశారు. గత ఐదు దశబ్దాలుగా రాజేంద్రప్రసాద్ అట్టడుగు వర్గాలు ప్రజలకు ఎనలేని సేవలను అందిస్తున్నారు. వారి అపార అనుభవం బీసీ సంక్షేమ సంఘానికి పూర్తిస్థాయిలో అందిస్తారని అప్పరాజు రాజు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని వారు అన్నారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర సలహాదారు డా తాళ్ల రవి, రాష్ట్ర కార్యదర్శి వడ్లకొండ వేణు గోపాల్, రాష్ట్ర అధ్యక్షుడు బైరీ రవికృష్ణలకు రాజేంద్రప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎఫ్-2 కాంబోలో ..

దర్శకుడు అనిల్ రావిపూడి మరోమారు తన పాత కాంబోనో రాబోతున్నాడు. బాలకృష్ణ తో 'భగవంత్ కేసరి' అనే విజయవంతమైన సినిమా చేసాడు. తరువాత అనిల్ రావిపూడి ఎవరితో చేస్తున్నాడనే విషయంపై ఇప్పుడు ఒక క్లారిటీ వచ్చింది. తన తదుపరి సినిమా వెంకటేష్ కథానాయకుడిగా చేస్తున్నాడు అని తెలిసింది. అయితే ఇందులో ఇంకొక కథానాయకుడిగా వరుణ్ తేజ్ కూడా నటిస్తున్నాడని అంటున్నారు. అయితే ఈ సినిమా మాత్రం 'ఎఫ్ 2' సినిమాకి సీక్వెల్ మాత్రం కాదంటున్నారు. ఇప్పుడు మళ్ళీ వెంకటేష్, వరుణ్ తేజ్ అనగానే ఆ సినిమాలకి సీక్వెల్ గా ఉంటుంది అని అనుకుంటున్నారు, కానీ ఇది పూర్తిగా దానికి భిన్నమైన కథ అని తెలిసింది. అందుకే ఆ సినిమాకి ఇది సీక్వెల్ కాదు అని అంటున్నారు. ఈ సినిమాకి కూడా దిల్ రాజు నిర్మాత అనే తెలిసింది. ఇప్పుడు ఈ ఇద్దరికీ అనిల్ రావిపూడి ఈ సినిమాతో ఒక మంచి విజయం అందిస్తాడని అనుకుంటున్నారు. ఈసారి సంగీత దర్శకుడిగా భీమ్స్ సిసిరోలియో ని తీసుకుంటున్నట్టుగా సమాచారం.





## శంకర్ మహదేవన్, జాకీర్ హుస్సేన్‌లకు గ్రామీ అవార్డులు

సంగీత రంగంలో ప్రతిష్టాత్మకంగా భావించే 66వ గ్రామీ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రపంచ దేశాలకు చెందిన సినీ ప్రముఖులు తమ పాటలతో సందడి చేశారు. అంతర్జాతీయ వేదికపై జరిగిన ఈ వేడుకలో భారతీయ సంగీత కళాకారులు శంకర్ మహదేవన్ , జాకిర్ హుస్సేన్ విజయకేతనం ఎగురవేశారు. 'శక్తి' పేరుతో ఈ టీమ్ కంపోజ్ చేసిన 'దిస్ మూమెంట్' ఉత్తమ గ్లోబల్ మ్యూజిక్ ఆల్బమ్ అవార్డును సొంతం చేసుకుంది. జాన్ మెక్‌లాఫ్లిన్ (గిటార్), జాకిర్ హుస్సేన్ (తబలా), శంకర్ మహదేవన్(సింగర్), గణెశిశ్ రాజగోపాలన్ (వయోలిన్) ఇలా ప్రతిభ గల ఎనిమిది మంది 'శక్తి' బ్యాండ్ పేరుతో ఈ ఆల్బమ్ కంపోజ్ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది పోటీని ఎదుర్కొని 'శక్తి' టీమ్ విజేతగా నిలిచింది. వీరికి అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుతున్నాయి. అలాగే మిడ్ నైట్స్ ఆల్బమ్‌కు గానూ టేలర్ స్విఫ్ట్ ఆల్బమ్ ఆఫ్ ది ఈయర్ పురస్కారం అందుకున్నారు. శంకర్ మహదేవన్ మాట్లాడుతూ 'ప్రతి విషయంలో నాకు ఎంతో ప్రోత్సాహం అందించిన నా భార్యకు ఈ అవార్డును అంకితం చేస్తున్నాను. దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నా' అని తెలిపారు.

గ్రామీ - 2024 విజేతలు..

ఉత్తమ ర్యాప్ ఆల్బమ్ - మైఖేల్ (కిల్లర్ మైక్)
ఉత్తమ ఆఫ్రికన్ సంగీత ప్రదర్శన - టైలా (వాటర్)
ఉత్తమ రాక్ సాంగ్, ప్రదర్శన - బాయ్‌జెనియస్ (నాట్ స్టాం÷-రగ్ ఎనఫ్)
ఉత్తమ రాక్ ఆల్బమ్ - పారామోర్ (దిస్ ఇజ్ వై)
ఉత్తమ కామెడీ ఆల్బమ్ - డేవ్ చాపెల్ ( వాట్స్ ఇన్ ఏ నేమ్)
ఉత్తమ కంట్రీ సాంగ్, సోలో ప్రదర్శన - క్రిస్ స్టేప్లెటన్ (వైట్ హార్స్)
మ్యాజిక్ వీడియో - జోనథన్ ÷-లకైడ్ ఎమ్ కూపర్ (ఐయామ్ ఓన్లీ స్లీపింగ్)
గ్లోబల్ మ్యూజిక్ ప్రదర్శన - జాకిర్ హుస్సేన్, బెలా ఫెక్ (పష్టో)
గ్లోబల్ మ్యూజిక్ ఆల్బమ్ - శక్తి (దిస్ మూమెంట్)
ఉత్తమ క్లాసికల్ సోలో వోకల్ ఆల్బమ్ - జూలియా బూల్లక్, సోలోయిస్ట్ (వాకింగ్ ఇన్ ద డార్క్)

## రకుల్ బ్యాచ్‌లర్ పార్టీ





తన అందం, అభినయంతో టాలీవుడ్‌తోపాటు బాలీవుడ్‌లో కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్న భామల్లో టాప్‌లో ఉంటుంది రకుల్ ప్రీత్ సింగ్. టాలీవుడ్‌లో అగ్రహీరోలతో నటించిన ఈ ఢిల్లీ భామ ప్రస్తుతం తన దృష్టిని అంతా బాలీవుడ్‌పైనే పెట్టింది. అయితే ఈ భామ త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ నటుడు జాకీ భగ్నానీతో రకుల్ ఈ నెల 21న గోవాలో పెళ్లి చేసుకోబోతుంది. ఈ క్రమంలో రకుల్ ప్రీత్ సింగ్ తన స్నేహితులకు బ్యాచిలర్ పార్టీ ఇచ్చింది. థాయ్ లాండ్ వేడుకగా ఈ బ్యాచిలర్ పార్టీ జరుగగా.. ఈ పార్టీకి టాలీవుడ్ హీరోయిన్స్ ప్రగ్యా జైస్వాల్, సీరత్ కపూర్, మంచు లక్ష్మి తదితరులు హాజరయ్యారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఫిబ్రవరి 21న గోవాలోని ఓ రిసార్ట్‌లో కుటుంబసభ్యులు, స్నేహితులు, సన్నిహితుల సమక్షంలో రకుల్ పెళ్లి గ్రాండ్‌గా జరుగనుంది. ఇదిలావుంటే.. రకుల్ ప్రస్తుతం హిందీలో మేరీ పత్నీ కా రీమేక్‌లో నటిస్తోంది. మరోవైపు తమిళంలో తెరకెక్కుతున్న ఇండియన్ 2 సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తోంది. రకుల్ తెలుగులో చివరగా 2021లో వచ్చిన కొండపొలంలో నటించింది. ఆ తర్వాత హిందీపైనే ఎక్కువ ఫోకస్ పెట్టింది.

## 18ఏళ్ల కు మళ్లీ చిరంజీవితో ..





మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'విశ్వంభర'. పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తున్నాడు. సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ మూవీ తెరకెక్కుతుండగా యువీ క్రియేషన్స్ సంస్థ సుమారు రూ. 200 కోట్లతో బ్జడెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తుంది. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా ఈ చిత్రాన్ని 2025 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇదిలావుంటే ఈ సినిమాకు సంబంధించి సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీలో కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నట్లు చిత్రయూనిట్ తెలిపారు. ఇక 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవితో పాటు త్రిష కూడా జాయిన్ అయినట్లు వెల్లడించారు. 18ఏళ్ల క్రితం చిరంజీవితో 'స్టాలిన్' సినిమాలో నటించింది త్రిష. మళ్లీ ఇన్నాళ్లకు మెగాస్టార్‌తో జతకట్టనుంది. మెగా అభిమానులకు ఇది నిజంగా శుభవార్తే.

సోమవారం 05, ఫిబ్రవరి 2024
www.warangalvoice.net

# అండగా ఉండి.. ఆశీర్వదించండి

**ఓరుగల్లు ముఖచిత్రంపై చెదరని సంతకం ప్రణయన్నది**

**మీ అందరి ఆశీస్సులతో త్వరలో నా నిర్ణయం వెల్లడిస్తా..**

**ఆత్మీయ సమ్మేళనంలో దాస్యం అభినవ్ భాస్కర్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అందరు పుడతారు..మరణిస్తారు..కానీ కొందరే మరణించి జీవిస్తారు.. ఆ కోవకు చెందినవారే స్వర్గీయ దాస్యం ప్రణయ్ భాస్కర్ అని పలువురు వక్తలు కొనియాడారు. హనుమకొండలోని శారద గార్డెన్ లో సోమవారం ప్రణయ్ భాస్కర్ తనయుడు, కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ అధ్యక్షతన ప్రణయన్న ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణయన్నతో తమకున్న బంధాన్ని గుర్తు చేసుకుంటూ పలువురు ఉద్వేగానికి గురయ్యారు. తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనాడు స్వర్గీయ దాస్యం ప్రణయ్ భాస్కర్ ప్రాతినిధ్యం వహించిన హనుమకొండ నియోజకవర్గం పరిధిలోని కొండపర్తి, సోమిడి, కాజీపేట, వడ్డేపల్లి, హనుమకొండ, కుమార్పల్లి, పెద్దమ్మగడ్డ, పెగడపల్లి, పైడిపల్లి, హాసన్ పర్తి, మునిపల్లి గ్రామాల నుంచి ప్రణయన్న ఆత్మీయులు, కళాశాల స్నేహితులు పెద్దఎత్తున తరలివచ్చారు. ట్యాంక్ బండ్ పై, హనుమకొండ గడ్డపై ప్రణయన్న విగ్రహం పెట్టడంతోపాటు జేఎన్ స్టేడియానికి ప్రణయ్ భాస్కర్ పేరు పెట్టాలని సమ్మేళనంలో పలువురు డిమాండ్ చేశారు.

## ఉద్వేగానికి గురైన ఆత్మీయులు..

ఈ సందర్భంగా పలువురు ప్రణయన్నతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. ప్రణయ్ అకాల మరణం మా కుటుంబాల్లో చీకటిని నింపిందన్నారు. తమ ప్రాణాలను పోలీసుల ఎన్ కౌంటర్ల నుంచి కాపాడిన దేవుడు ప్రణయన్న అని కీర్తించారు. కులం, మతం, భాషా బేధాలు లేకుండా ప్రజలతో తన కుటుంబంలా మెదిలిన వ్యక్తి ప్రణయ్ భాస్కర్ అని



కొనియాడారు. ఎంతో మందికి ఉద్యోగాలు, ఉపాధిని కల్పించిన మహనీయుడు ప్రణయ్ భాస్కర్ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి దివిటీ, దేశ రాజకీయాల్లో ప్రధాని కొడుకును ఓడించిన సంచలనం ప్రణయన్న అన్నారు. మళ్లీ అట్లాంటి మహానాయకుడు రాడు..రాలేడన్నారు. ఇన్నేండ్లు అయినప్పటికీ మా గుండెల్లో ఆయన స్థానం పదిలమని తేల్చిచెప్పారు. సుమారు 27 ఏండ్ల తరువాత ప్రణయన్న ఆత్మీయులను ఒక్కచోటికీ చేర్చిన ఆయన ఆశయ సారథి దాస్యం అభినవ్ భాస్కర్ కు కృతజ్ఞతలు తెలిపారు. అభినవ్ భాస్కర్ రాజకీయ ప్రయాణంలో మేమందరం తండ్రి స్థానంలో ఉండి ముందుకు నడుపుతామంటూ హామీ ఇచ్చారు.



## మీ మాటల్లో మా నాన్నను పోల్చుకున్నా..

అనంతరం ప్రణయ్ భాస్కర్ తనయుడు, కార్పొరేటర్ డాక్టర్ దాస్యం అభినవ్ భాస్కర్ మాట్లాడుతూ..నాకు ఊహ తెలియని వయసులో నాన్న మాకు దూరమైతే, మీ మాటల్లోనే నేనిప్పటివరకు ఆయన్ను పోల్చుకున్నాను, ఆయన వ్యక్తిత్వాన్ని ఊహించుకున్నానన్నారు. ఇయ్యాల ఇంతమంది మా నాన్నతో కలిసి నడిసిన నా ఆప్తులందరినీ ఒకే వేదికపై కలుసుకోవడం నాకు ఊహించలేని సంతోషంగా ఉందన్నారు. ఆయన మరణాంతరం ఒక కుటుంబ దిక్కును కోల్పోయినట్లు మీరందరు బిక్కుబిక్కుమని గడిపింద్రు అంటూ చెప్పుకొచ్చారు. ఇవ్వాళ నా ఆత్మీయుల ముందు ఒక విషయాన్ని ప్రస్తావించాలని అనుకుంటున్నానంటూ వినమ్రంగా ప్రకటించారు. ప్రణయన్న మరణాంతరం జరిగిన పరిణామాలు మీ అందరికీ తెలుసు.. మా అమ్మ అనాడు తన భవిష్యత్తును త్యాగం చేస్తే, ఇవాళ నా కుటుంబం కోసం నేను త్యాగం చేసి పోటీ నుంచి తప్పుకున్నానని గుర్తు చేశారు. ఇప్పటి వరకు నేను కుటుంబానికి విలువనిచ్చి ఎన్నికల్లో ఆయన గెలుపుకు కష్టపడితే రాష్ట్రంలో ఎదురుదెబ్బ తగిలి బీఆర్ ఎస్ పార్టీ ఓడిపోతే ఆ ఓటమికి నేను కారణమని ప్రచారం చేయడం ఒక విధంగా నన్ను ఎంతో కృంగదీసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రణయన్న వారసుడిగా..

ఎవరు ఆపాలనుకున్న ప్రణయన్న ఏకైక వారసుడిగా మీ ముందు నిలబడుతానంటూ అభినవ్ భాస్కర్ ఆహుతుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇట్లాంటి సమయంలో కూడా నన్ను నమ్ముకున్న, నా రాక కోసం ఎదురు చూస్తున్న నా వాళ్ళ కోసం నేనొక నిర్ణయం తీసుకోకపోతే ఈ రాజకీయ వ్యవస్థకు నేను సమర్థుడను కాననుకోవాల్సి వస్తుందన్నారు. ఈ సమయంలో నాకు తండ్రి స్థానంలో ఉన్న మీ అందరినీ కలిసి మాట్లాడితే గుండె బరువు దిగుతదని నేను మిమ్మల్ని ఇలా కలుసుకుంటున్నానన్నారు. ఇకపై కలుసుకుంటూనే ఉంటాను.. నా నిర్ణయానికి మీ మద్దతు, ఆశీస్సులు అందుతాయని ఆశిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రణయన్న ఆత్మీయులు రాష్ట్ర మైనారిటీ కమిషన్ మెంబర్ దర్శన్ సింగ్, మాజీ కార్పొరేటర్ డిన్న, విరమల్ల భిక్షపతి, రావుల సుదర్శన్, సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రణయన్న మిత్రులు పాల్గొన్నారు.



## అభినవ్ చూపు బీజేపీ వైపు..?

మాజీ మంత్రి స్వర్గీయ దాస్యం ప్రణయ్ భాస్కర్ తనయుడు, కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ భారతీయ జనతా పార్టీలో చేరుతారన్న ప్రచారం సాగుతోంది. సోమవారం ఆయన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కుటుంబ కట్టుబాట్ల కోసం ఎంతో చేసినప్పటికీ అవమానాలకు గురి చేయడాన్ని తట్టుకోలేక పోతున్నానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే నా రాజకీయ జీవితాన్ని మీ అందరి ఆశీస్సులతో త్వరలో ప్రకటిస్తానంటూ వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందుకు కాంగ్రెస్ పార్టీ పరకాల టికెట్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా కట్టుబాట్లను గౌరవించే వ్యక్తిగా వాటిని వదులుకున్నానని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే త్వరలోనే అభినవ్ భాస్కర్ బీఆర్ఎస్ ను వీడి బీజేపీలో చేరనున్నట్లు తెలుస్తోంది.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com